ఈసా మరియు మరియమ్
(వారిపై శాంతి కలుగుగాక)
గురించి ఖుర్ఆన్‌లో చెప్పిన యథార్థాలు

(క్రైస్తవులు తెలుసుకోవలసిన విషయాలు)

ప్రచురణ

MASFOT
Raise Yourself To Help Mankind
NABA
MAS FOUNDATION TRUST

MAS Foundation Trust
19 Thacker Street
Purasawalkam
Chennai 600 084
88388 92393

Telugu JEM

దేవుడు (అల్లాహ్) విశ్వాన్ని సృష్టించాడు మరియు ఈ క్రింది ముఖ్యమైన మూడు సూత్రాల ప్రకారమే జీవించటానికి, (మొట్ట మొదటి మనిషి) అదమ్ ను భూమిపై స్థిరపరిచాడు.

ప్రళయం రోజు వరకు ఈ మూడు సూత్రాలకు అందరూ తప్పకుండా కట్టుబడి ఉండాలి.


చనిపోయిన తరువాత స్వర్గాన్ని పొందటానికి మీరు మరియు మీ వారసులు తప్పకుండా తెలుసుకోవాలి మరియు అనుసరించాలి. అవి ఇక్కడ ఉన్నాయి.



Monotheism



Prophethood



Life After Death

ఈసా మరియు మరియమ్

(వారిపై శాంతి కలుగుగాక)

గురించి ఖుర్ఆన్‌లో చెప్పిన యథార్థాలు

(క్రైస్తవులు తెలుసుకోవలసిన విషయాలు)

ప్రచురణ

MAS FOUNDATION TRUST
19 **THACKER STREET**
PURASAWALKAM
CHENNAI 600 084
88388 92393

ముందుమాట

ప్రియమైన సోదరులు మరియు సోదరీమణులారా!

మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం ఈసా (అలైహిస్సలాం) మరియు అతని తల్లి మేరీ (మర్యమ్-అలైహస్సలాం) గురించి తేటతేల్లని, స్పష్టమైన సత్యాలు తెలుపుతుంది, ఏ సత్యాలనైతే చిట్ట చివరి పవిత్ర గ్రంథం ఖుర్ఆన్, తెలియజేస్తున్నదో.

ముస్లింల విశ్వాసంతో వారికి ఏదో ఒక సంబంధం కలిగి ఉందని చాలా మంది క్రైస్తవులకు తెలుసు, కానీ అది ఏమిటో వారికి స్పష్టంగా తెలియదు.

ఇదిగో...

ప్రవక్త ఇబ్రాహీం (అబ్రహం-అలైహిస్సలాం)కు ఇద్దరు కుమారులు ఉన్నారు, ఒకరు ఇస్-హాక్ (ఇస్సాక్-అలైహిస్సలాం) మరియు మరొకరు ఇస్మాయీల్ (అలైహిస్సలాం). మూసా (మోషే-అలైహిస్సలాం) మరియు ఈసా (అలైహిస్సలాం) వీరివురూ ఇస్-హాక్ (ఇస్సాక్-అలైహిస్సలాం) వారసులని ఖుర్ఆన్ స్పష్టంగా పేర్కొన్నది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇస్మాయీల్ (అలైహిస్సలాం) వారసుడు. పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన రెండూ ఇస్మాయీల్ వారసులలో అంతిమ ప్రవక్త వస్తాడని పేర్కొన్నాయి.

నేటి సౌదీ అరేబియాలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారు సుమారు 1450 సంవత్సరాల క్రితం జన్మించారు. 40 సంవత్సరాల వయస్సులో, దేవుడు అతనిని (చిట్టచివరి) ప్రవక్తగా ఎన్నుకున్నాడు మరియు ఆయన 63 సంవత్సరాల వయస్సులో మరణించారు. ఈ 23 సంవత్సరాల జీవిత కాలంలో, దేవుడు జిబ్రాయీల్ దైవదూత ద్వారా పవిత్ర

ఖుర్ఆన్‌ను అతని పై అవతరింపజేశాడు. ఇదే చిట్టచివరి దైవగ్రంథం. దీని తరువాత ప్రపంచం అంతమయ్యే వరకు ఏ ఇతర దైవగ్రంథం రాదు మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తర్వాత ఏ ఇతర ప్రవక్తా రాడు.

ఈ చిట్టచివరి గ్రంథం ఆదమ్ నుండి యేసు (ఈసా) వరకు మునుపటి ప్రవక్తలందరినీ సమర్థిస్తుంది మరియు ప్రవక్తలందరూ ఒకే విధమైన సూత్రాలతో వచ్చారు. ఒకటి మనలను సృష్టించిన ఆ ఒక్క దేవుణ్ణి మాత్రమే ఆరాధించడం మరియు రెండవది దేవుడు ఏ ప్రవక్తను ఎంచుకుంటాడో అతను (ఆ ప్రవక్త) ఏమి చేయాలో మరియు ఏమి చేయకూడదో ప్రజలకు తెలియజేస్తాడు (హలాల్ మరియు హరామ్) మరియు ప్రజలు అతనిని అనుసరించాలి, ఇది దేవుడి చట్టం.

ఈ సూత్రాల ఆధారంగా మునుపటి ప్రవక్తలందరినీ మరియు గ్రంథాలన్నింటినీ పవిత్ర ఖుర్ఆన్ ధృవీకరిస్తున్నది.

ఈ విధంగా, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పుట్టడానికి సుమారు 600 సంవత్సరాల ముందు జన్మించిన యేసుక్రీస్తు (ఈసా) గురించి మరియు అతని తల్లి మరియం ఎంత గొప్ప మహిళయో మరియు ఆమె జన్మ గురించి కూడా దేవుడు ఖుర్ఆన్‌లో స్పష్టంగా పేర్కొన్నాడు. యేసుక్రీస్తు (ఈసా) ప్రవక్త అని, దేవుని కుమారుడు కాదని, అలా అనడం మహాపాపమని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది.

క్రైస్తవ సమాజం సత్యాన్ని అర్థం చేసుకొని అల్లాహ్ వైపు మరళేలా (ప్రత్యేకంగా) ఖుర్ఆన్‌లో పేర్కొన్న ఆ వచనాలను సంకలనం చేసి ఈ పుస్తకం ప్రచురించబడినది.

MAS Foundation Trust

గమనిక

ఈ వచనాలలో అల్లాహ్ అనే పదం కనిపిస్తుంది.

ఇది ఏకైక దేవునికి అరబీ పదం.

ఖుర్‌ఆన్‌లో యేసు (ఈసా) మరియు మేరీ (మర్యమ్) ప్రస్తావన

అల్ - బఖరహ్ 2:87 - మేము మూసాకు గ్రంథం ఎొసగాము. అతని తరువాత కూడా ప్రవక్తలను పంపించాము. ఇంకా మేము మర్యమ్ కుమారుడైన ఈసాకు స్పష్టమైన నిదర్శనాలు ఇచ్చాము. రూహుల్ ఖుదుస్ ద్వారా అతనికి సహాయం చేశాము. అయితే ఏ ప్రవక్త అయినా మీ మనసులకు నచ్చని విషయాలు మీ వద్దకు తెచ్చినప్పుడల్లా మీరు అహంకారం ప్రదర్శించారు. వారిలో కొందరిని ధిక్కరించారు, మరి కొందరిని హతమార్చటం కూడా చేశారు.

అల్ - బఖరహ్ 2:136 - (విశ్వాసులారా!) మీరు ఇలా ప్రకటించండి: ''మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవతరింప జేయబడిన దానినీ, ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై అవతరింపజేయబడిన దానినీ, మూసా, ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరపున ఎొసగబడిన దానిని కూడా మేము విశ్వసించాము. మేము వారిలో ఎవరి మధ్య కూడా ఎలాంటి విచక్షణ (వివక్ష)ను పాటించము. మేము ఆయనకే విధేయులము.''

అల్ - బఖరహ్ 2:253 - వీరు దైవప్రవక్తలు. వీరిలో కొందరికి మరికొందరిపై మేము ప్రాధాన్యతను ఎొసగాము. వీరిలో కొందరితో అల్లాహ్ సంభాషించాడు. కొందరి తరగతులను ఉన్నతం చేశాడు. ఇంకా మేము మర్యమ్ కుమారుడగు ఈసాకు స్పష్టమైన సూచనలు ప్రసాదించాము. పరిశుద్ధాత్మ ద్వారా అతనికి తోడ్పాటునందించాము. ఒకవేళ అల్లాహ్‌యే గనక తలిస్తే వీరి తరువాత స్పష్టమయిన నిదర్శనాలు చూసిన ప్రజలు పరస్పరం తగవులాడుకునేవారు కాదు. కాని వారు విభేదాల్లో పడిపోయారు. వారిలో కొందరు విశ్వసించగా, మరి కొందరు అవిశ్వాసులుగా ఉండిపోయారు. అల్లాహ్ గనక కోరితే వీరు పరస్పరం కలహించుకునే వారు కారు. కాని అల్లాహ్ మాత్రం తాను తలచిందే చేస్తాడు.

ఆలె - ఇమ్రాన్ 3:33 - నిశ్చయంగా అల్లాహ్ ఆదమ్‌నూ, నూహ్‌నూ, ఇబ్రాహీం పరివారాన్నీ, ఇమ్రాన్ సంతతినీ సమస్త లోకవాసులపై (వారికి ప్రాధాన్యత ఇచ్చి) ఎన్నుకున్నాడు.

ఆలె - ఇమ్రాన్ 3:34 - వారిలో కొందరు మరికొందరి సంతానం. అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

ఆలె -ఇమ్రాన్ 3:35 - (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేయి,) ఇమ్రాను భార్య ఇలా వేడుకున్నది: ''ఓ నా ప్రభూ! నా గర్భంలో ఉన్న దానిని నీ సేవ కోసం అంకితం చేయాలని మొక్కుకున్నాను. నీవు నా తరపున దీనిని స్వీకరించు. నిస్సందేహంగా నీవు సర్వం వినేవాడవు, సర్వం తెలిసినవాడవు.''

ఆలె - ఇమ్రాన్ 3:36 - తరువాత ఆమె ప్రసవించినప్పుడు, ''ప్రభూ! నాకు ఆడపిల్ల కలిగినదే!'' అని విన్నవించుకుంది. ఆమె కన్న సంతానం ఏదో అల్లాహ్‌కు బాగా తెలుసు. మగ పిల్లవాడు ఆడపిల్ల వంటివాడు కాడు. ''నేను ఈ పాపకు మర్యమ్ అని పేరు పెట్టాను. నేను ఈమెనూ, ఈమె సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుంచి రక్షణ పొందటానికి నీకు అప్పగిస్తున్నాను'' అని అన్నది.

ఆలె - ఇమ్రాన్ 3:37 - అంతే! ఆమె ప్రభువు ఆ పసిపాపను ఉత్తమరీతిలో స్వీకరించి, అత్యుత్తమ రీతిలో ఆమెను పోషించాడు. ఆమె బాగోగులు చూసే బాధ్యతను జకరియ్యాకు అప్పగించాడు. జకరియ్యా ఆమె కుటీరానికి వెళ్ళినప్పుడల్లా, ఆమె వద్ద ఆహార పదార్థాలు కనిపించేవి. ''మర్యమ్! ఇవి నీ వద్దకు ఎక్కడి నుంచి వచ్చాయి?'' అని ఆయన అడిగితే, ''అల్లాహ్ వద్ద నుంచి'' అని ఆమె చెప్పేది. నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిన వారికి లెక్క లేనంతగా ఉపాధిని ప్రసాదిస్తాడు.

ఆలె - ఇమ్రాన్ 3:42 - (ఆ సందర్భాన్ని కూడా జ్ఞాపకం చేయి. మర్యమ్‌ను ఉద్దేశించి) దైవదూతలు ఇలా అన్నారు: ''ఓ మర్యమ్! అల్లాహ్ (తన సేవ కొరకు) నిన్ను ఎన్నుకున్నాడు. నిన్ను పరిశుద్ధురాలిగా చేశాడు. ప్రపంచంలోని మహిళలందరిపై నీకు ప్రాధాన్యతను ఇస్తూ నీ ఎంపిక చేశాడు.

ఆలె - ఇమ్రాన్ 3:43 - ''(కనుక) ఓ మర్యమ్! నువ్వు నీ ప్రభువుకు విధేయత చూపు. ఆయనకు సజ్దా చెయ్యి (ఆయన సాన్నిధ్యంలో మోకరిల్లు). 'రుకూ' చేసే వారితో పాటు నువ్వూ రుకూ చెయ్యి (వినమ్రతతో ఆయన ముందు తలవంచు).''

ఆలె - ఇమ్రాన్ 3:44 - ఇవి అగోచర విషయాలలోనివి. (ఓ ప్రవక్తా!) వాటిని నీకు వహీ ద్వారా తెలియజేస్తున్నాము. మర్యమ్‌కు పోషకులుగా ఎవరుండాలి? అన్న విషయమై వారు తమ కలములు విసరినప్పుడు నీవు అక్కడ లేవు. (ఈ వ్యవహారంపై) వారు గొడవ పడినప్పుడు కూడా నీవు అక్కడ లేవు.

ఆలె - ఇమ్రాన్ 3:45 - దైవదూతలు, ''ఓ మర్యమ్! అల్లాహ్ నీకు తన వాక్కుకు సంబంధించిన శుభవార్తను వినిపిస్తున్నాడు. అతని పేరు మసీహ్ ఈసా బిన్ మర్‌యమ్. అతడు ఇహపరాలలో గౌరవనీయుడవుతాడు. అతను (అల్లాహ్) సామీప్యం పొందిన వారిలో ఒకడు.''

అలి-ఇమ్రాన్ 3:46 ''అతడు ఉయ్యాలలో ఉన్నప్పుడూ, పెద్దవాడైనప్పుడూను ప్రజలతో మాట్లాడతాడు. ఇంకా అతడు సద్వర్తనులలోని వాడై ఉంటాడు'' అని అన్నప్పుడు;

ఆలె - ఇమ్రాన్ 3:47 - ఆమె, ''నా ప్రభూ! నాకు పిల్లవాడు ఎలా పుడ్తాడు? నన్ను ఏ మనిషీ తాకలేదే!'' అని అన్నది. ''అలాగే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరినది పుట్టిస్తాడు. ఆయన ఏదైనా పనిని చేయ సంకల్పించుకుని 'అయిపో' అని అంటే చాలు, అది 'అయిపోతుంది' అని (దైవదూత ద్వారా) సమాధానం లభించింది.

ఆలె - ఇమ్రాన్ 3:48 - అల్లాహ్ అతనికి అక్షర జ్ఞానాన్ని, వివేకాన్ని, తౌరాతు, ఇన్జీలు గ్రంథాల జ్ఞానాన్నీ నేర్పుతాడు (అని కూడా దైవదూతలు తెలిపారు).

ఆలె - ఇమ్రాన్ 3:49 - ఇంకా అతను ఇస్రాయీలు వంశీయుల వైపుకు ప్రవక్తగా పంపబడతాడు. (వారినుద్దేశించి ఆయన ఇలా అంటాడు:) ''నేను మీ వద్దకు మీ ప్రభువు దగ్గరి నుంచి సూచనను

తీసుకువచ్చాను. నేను మీ కోసం పక్షి ఆకారం ఉన్న ఒక మట్టి బొమ్మను తయారు చేసి అందులో ఊదుతాను. అల్లాహ్ ఆజ్ఞతో అది పక్షి అవుతుంది. ఇంకా అల్లాహ్ ఆజ్ఞతో నేను పుట్టుగ్రుడ్డిని, కుష్ఠు రోగిని బాగుచేస్తాను. మృతులను బ్రతికిస్తాను. మీరు తినే వాటినీ, మీరు మీ ఇండ్లలో నిలువచేసి ఉంచిన వాటిని గురించి (కూడా) చెబుతాను. మీరే గనక విశ్వసించేవారైతే ఇందులో మీ కొరకు గొప్ప సూచన ఉంది.''

ఆలె - ఇమ్రాన్ 3:50 - ''ఇంకా నేను నాకు పూర్వం అవతరించిన తౌరాతు (గ్రంథము)ను ధృవపరుస్తున్నాను. మీ కొరకు నిషేధించబడిన కొన్ని వస్తువులను ధర్మసమ్మతం గావించటానికి కూడా నేను వచ్చాను. ఇంకా నేను మీ వద్దకు మీ ప్రభువు సూచనను తీసుకు వచ్చాను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి.''

ఆలె - ఇమ్రాన్ 3:51 - ''నిశ్చయంగా అల్లాహ్ నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. కనుక మీరంతా ఆయన్నే ఆరాధించండి. ఇదే రుజుమార్గం.''

ఆలె - ఇమ్రాన్ 3:52 - అయితే వారిలోని తిరస్కార వైఖరిని పసిగట్టిన తరువాత ఈసా, ''అల్లాహ్ మార్గంలో నాకు తోడ్పడేవారెవరు?'' అని ప్రశ్నించగా, హవారీలు, ''అల్లాహ్ మార్గంలో మేము (మీకు) తోడ్పడతాము. మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మేము విధేయులమయ్యాము. ఈ విషయానికి మీరు సాక్షులుగా ఉండండి'' అని జవాబిచ్చారు.

ఆలె - ఇమ్రాన్ 3:53 - (వారు ఇంకా ఇలా అన్నారు:) ''ప్రభూ! నీవు అవతరింపజేసిన దాన్ని మేము విశ్వసించాము. మేము నీ ప్రవక్తను అనుసరించాము. కనుక సాక్షుల జాబితాలో మా పేర్లు కూడా వ్రాసుకో.''

ఆలె - ఇమ్రాన్ 3:54 - అవిశ్వాసులు రహస్యంగా ఎత్తులు వేయసాగారు. అల్లాహ్ కూడా వారి ఎత్తులకు పై ఎత్తులు వేశాడు. ఎత్తులు వేసే వారిలో అల్లాహ్ సాటిలేని మేటి.

అలె - ఇమ్రాన్ 3:55 - అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు : ఓ ఈసా! నేను నిన్ను పూర్తిగా తీసుకుంటాను. నిన్ను నా వైపుకు లేపుకుంటాను. అవిశ్వాసుల బారి నుంచి నిన్ను పరిశుద్ధునిగా చేస్తాను. నిన్ను అనుసరించిన వారిని ప్రళయదినం వరకూ అవిశ్వాసులపై పైచేయిగా ఉంచుతాను. ఆ తర్వాత మీరంతా మరలి రావలసింది నా వద్దకే. అప్పుడు నేనే మీ మధ్య ఉన్న పరస్పర విభేదాలపై తీర్పు చేస్తాను.

అన్ - నిసా 4:157 - ఇంకా – "మర్యమ్ పుత్రుడగు దైవప్రవక్త ఈసాను మేము హతమార్చాము" అని అనటం వల్ల – (వారు శిక్షను చవిచూశారు). నిజానికి వారు ఆయన్ని చంపనూలేదు, శిలువ పైకి ఎక్కించనూ లేదు. నిజం ఏమిటంటే, వారి కొరకు ఆయన్ని పోలిన వ్యక్తి రూపొందించబడ్డాడు. ఈసా విషయంలో విభేదించినవారు ఆయన వ్యవహారంలో సందేహానికి లోనయ్యారు. అంచనాలను అనుసరించటం తప్ప వారికి ఈ విషయమై ఖచ్చితంగా ఏమీ తెలియదు. అసలు వారు ఆయన్ని చంపలేదు,

అన్ - నిసా 4:159 - గ్రంథవహులలో ఏ ఒక్కడూ ఈసాను, అతని (అంటే తన లేక ఆయన) మరణానికి మునుపు విశ్వసించకుండా మిగలడు. ప్రళయ దినాన ఆయన వారిపై సాక్షిగా ఉంటాడు.

అన్ - నిసా 4:163 - (ఓ ముహమ్మద్!) మేము నూహ్ వైపుకు, అతని తరువాత వచ్చిన ప్రవక్తల వైపుకు వహీ పంపినట్లే (వాణిని అవతరింపజేసినట్లే) నీ వైపుకూ వహీ పంపాము. ఇంకా మేము ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాకూబు మరియు అతని సంతతి వారికి, ఈసా, అయ్యూబు, యూనుసు, హారూను, సులైమానుల వైపుకు కూడా వహీ పంపాము. ఇంకా మేము దావూదుకు జబూరు (గ్రంథం) ఒసగాము.

అన్ - నిసా 4:171 - ఓ గ్రంథవహులారా! మీరు మీ ధర్మం విషయంలో అతిశయిల్లకండి. సత్యం తప్ప మరోమాట అల్లాహ్‌కు ఆపాదించకండి. మర్యమ్ కుమారుడైన ఈసా మసీహ్ కేవలం

దైవప్రవక్త మరియు (అయిపో అన్న) దైవవాక్కు (ద్వారా పుట్టించబడినవారు) మాత్రమే. దాన్ని ఆయన మర్యమ్ వైపు ప్రయోగించాడు. ఇంకా ఆయన (ఈసా), దేవుని దగ్గరి నుంచి వచ్చిన ఆత్మ మాత్రమే. కాబట్టి మీరు అల్లాహ్‌నూ, ఆయన పంపిన ప్రవక్తలందరినీ విశ్వసించండి. దేవుడు 'ముగ్గురు' అని అనకండి. ఈ (త్రిత్వం) వాదనను మానండి. ఇందులోనే మీకు మేలుంది. ఆరాధ్యుడగు అల్లాహ్ ఒక్కడు మాత్రమే. ఆయనకు కుమారుడున్నాడనే విషయానికి ఆయన అతీతుడు, పరిశుద్ధుడు. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నదంతా ఆయనకు చెందినదే. కార్య నిర్వాహకారిగా అల్లాహ్ ఒక్కడే చాలు.

అన్ - నిసా 4:172 - మసీహ్ (అలైహిస్సలాం) గానీ, అల్లాహ్ సామీప్యం పొందిన దూతలుగానీ తాము అల్లాహ్ దాసులు కావటాన్ని అగౌరవంగా, అవమానకరంగా ఎంత మాత్రం భావించరు. అల్లాహ్ దాస్యం చేయటాన్ని అవమానకరంగా, అగౌరవంగా భావించి, గర్వాతిశయంతో విర్రవీగే వారినందరినీ అల్లాహ్ తన వద్దకు ప్రోగుచేస్తాడు.

అల్ - మాఇదహ్ 5:17 - "అల్లాహ్ (అంటే) మర్యమ్ పుత్రుడైన మసీహ్‌యే" అని అన్నవారు నిస్సందేహంగా అవిశ్వాసానికి పాల్పడ్డారు. (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఒకవేళ అల్లాహ్ మర్యమ్ పుత్రుడైన మసీహ్‌ని, అతని తల్లిని, భూమండలంలోని సమస్త జనులనూ నాశనం చేయదలిస్తే, ఆయన్ని అడ్డుకోగల శక్తి, అధికారం ఎవరికున్నాయి? భూమ్యాకాశాలలోనూ, వాటి మధ్యలోనూ ఉన్నవాటి సమస్త సార్వభౌమత్వానికి అధిపతి అల్లాహ్‌యే. ఆయన తాను కోరిన దాన్ని సృష్టిస్తాడు. అల్లాహ్ ప్రతిదీ చేయగల అధికారం కలవాడు."

అల్ - మాఇదహ్ 5:19 - గ్రంథవహులారా! ప్రవక్తల ఆగమన క్రమంలో విరామం తర్వాత మా ప్రవక్త మీ వద్దకు వచ్చేశాడు. అతను మీకు స్పష్టంగా విడమరచి చెబుతున్నాడు. మా వద్దకు శుభవార్త అందించేవాడు, భయపెట్టేవాడు ఎవరూ రాలేదన్న మాట మీరు అనకుండా

ఉండేందుకుగాను (ఈ ఏర్పాటు జరిగింది). అందుకే ఇప్పుడు నిజంగా శుభవార్త వినిపించేవాడు, భయపెట్టేవాడు మీ వద్దకు వచ్చేశాడు. అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు.

అల్ - మాఇదహ్ 5:46 - ఆ ప్రవక్తల తరువాత మేము మర్యమ్ కుమారుడగు ఈసాను పంపాము. అతను తనకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని సత్యమని ధృవీకరించేవాడు. మేమతనికి ఇంజీలు గ్రంథాన్ని ఒసగాము. అందులో మార్గదర్శకత్వమూ, జ్యోతీ ఉండేవి. అది తనకు ముందున్న తౌరాతు గ్రంథాన్ని ధృవీకరించేది. అంతేకాదు, అది దైవభీతి కలవారికి ఆసాంతం మార్గదర్శిని మరియు హితబోధిని కూడా.

అల్ - మాఇదహ్ 5:72 - ''అల్లాహ్ (అంటే) మర్యమ్ కుమారుడగు మసీహ్‌యే'' అని చెప్పినవారు నిస్సందేహంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. యదార్థానికి మసీహ్ ఖుద్దుగా వారితో ఇలా పలికాడు : ''ఓ ఇస్రాయీలు వంశస్థులారా! నాకూ, మీకూ ప్రభువైన అల్లాహ్‌ను మాత్రమే పూజించండి.'' ఎవడు అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను కల్పించాడో అలాంటి వానికోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడని తెలుసుకోండి. అతని నివాసం నరకాగ్ని. దుర్మార్గులకు సహాయపడే వాడెవడూ ఉండడు.

అల్ - మాఇదహ్ 5:78 - ఇస్రాయీలు సంతతిలోని అవిశ్వాసులు దావూదు నోట, మర్యమ్ పుత్రుడైన ఈసా నోట శపించబడ్డారు. ఎందుకంటే వారు అవిధేయతకు పాల్పడేవారు. హద్దుమీరి ప్రవర్తించేవారు.

అల్ - మాఇదహ్ 5:110 - అప్పుడు అల్లాహ్ ఈ విధంగా అడుగుతాడు : ''మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నేను నీకూ, నీ తల్లికి ప్రసాదించిన అనుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకో. అప్పుడు రూహుల్ ఖుదుస్ (పరిశుద్ధాత్మ) ద్వారా నేను నీకు సహాయం చేశాను. నీవు ఊయలలో ఉన్నప్పుడు, పెద్దవాడైన తరువాత కూడా ప్రజలతో మాట్లాడేవాడివి. అప్పుడు నేను నీకు గ్రంథాన్నీ, వివేకాన్నీ తౌరాతునూ, ఇంజీలునూ నేర్పాను. అప్పుడు నీవు నా అనుమతితో, మట్టితో పక్షి ఆకారం లాంటి

దాన్ని తయారుచేసి, అందులోకి ఊదగానే నా అనుమతితో అది (నిజంగానే) పక్షి అయిపోయేది. అలాగే నీవు నా అనుమతితో పుట్టుగుడ్డినీ, కుష్టు రోగినీ బాగుచేసేవాడివి. నా అనుమతితో మృతులను లేపి నిలబెట్టే వాడివి. నీవు స్పష్టమైన నిదర్శనాలతో ఇస్రాయీలు వంశీయుల వద్దకు వచ్చినపుడు, 'ఇది స్పష్టమైన మాయాజాలం తప్ప మరేమీ కాదు' అని వారిలోని సత్య తిరస్కారులు చెప్పారు. ఆ సమయంలో మేము వారిని నీ నుంచి ఆపాము.

అల్ - మాఇదహ్ 5:112 - "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నీ ప్రభువు మా కోసం ఆహార పదార్థాలతో నిండిన ఒక పళ్లాన్ని ఆకాశం నుంచి దింపగలడా?" అని హవారీలు అడిగిన సందర్భం జ్ఞాపకం చేసుకోదగినది. అప్పుడు ఈసా, "మీరే గనక విశ్వాసులైతే అల్లాహ్‌కు భయపడండి" అన్నాడు.

అల్ - మాఇదహ్ 5:114 - అప్పుడు మర్యమ్ కుమారుడగు ఈసా ఇలా వేడుకున్నాడు : "ఓ అల్లాహ్! మా ప్రభూ! ఆకాశం నుంచి మాపై ఆహారంతో నిండిన పళ్లాన్ని దించు. అది మా కొరకు, అనగా మాలోని తొలివారు, తుది వారందరికీ సంతోషకరమైన విషయం (పండుగ) కావాలి. ఇంకా నీ తరపున అది ఒక సూచన కాగలగాలి. నీవు మాకు ఆహారం ప్రసాదించు. నీవు అందరికన్నా శ్రేష్ఠమైన ఆహార ప్రదాతవు."

అల్ - మాఇదహ్ 5:116 - (ఆ తరువాత) "మర్యమ్ పుత్రుడవైన ఓ ఈసా! అల్లాహ్‌ను వదలి నన్నూ, నా తల్లిని ఆరాధ్య దైవాలుగా చేసుకోండి అని గాని నీవు ప్రజలకు చెప్పావా?" అని అల్లాహ్ (నిలదీసి) అడిగే సందర్భం కూడా స్మరించుకోదగినదే. అప్పుడు ఈసా ఇలా విన్నవించుకుంటారు: "(ఓ అల్లాహ్!) నిన్ను పరమ పవిత్రునిగా భావిస్తున్నాను. ఏ మాటను అనే హక్కు నాకు లేదో అలాంటి మాటను అనటం నాకేమాత్రం తగదు. ఒకవేళ నేను గనక అలాంటిదేదైనా అని ఉంటే అది నీకు తెలిసి ఉండేది. నా మనసులో ఏముందో కూడా నీకు

తెలుసు. కాని నీ మనసులో ఏముందో నాకు తెలీదు. నిశ్చయంగా నీవు సమస్త గుప్త విషయాలను ఎరిగినవాడవు.

అల్ - అన్-ఆమ్ 6:85 - ఇంకా జకరియ్యా, యహ్యా, ఈసా, ఇల్యాస్‌లకు కూడా (మేము సన్మార్గం చూపించాము.) వారంతా సద్వర్తనుల కోవకు చెందినవారే.

అత్ - తౌబా 9:30 - ''ఉజైర్ అల్లాహ్ కుమారుడు'' అని యూదులంటున్నారు. ''మసీహ్ (ఏసు క్రీస్తు) అల్లాహ్ కుమారుడు'' అని నసారా (క్రైస్తవులు) అంటున్నారు. ఇవి వారి నోటి మాటలు మాత్రమే. తమ పూర్వీకుల్లోని అవిశ్వాసులు చెప్పిన మాటలనే వీళ్ళూ అనుకరిస్తున్నారు. అల్లాహ్ వారిని నాశనం చేయుగాక! (సత్యం నుండి) వారెలా తిరిగిపోతున్నారు!?

అల్ - కహఫ్ 18:4 - అల్లాహ్ సంతానం కలిగి ఉన్నాడని పలికేవారిని హెచ్చరించటానికి (ఈ గ్రంథం అవతరింపజెయ్యబడింది).

అల్ - కహఫ్ 18:5 - యదార్థానికి వారికిగానీ, వారి తాత ముత్తాతలకుగానీ ఈ విషయం ఏమీ తెలియదు. వారి నోట వెలువడే ఈ మాట ఎంతో దారుణమైనది. వారు చెప్పేదంతా పచ్చి అబద్ధమే.

మర్యమ్ 19:16 - (ఓ ముహమ్మద్ – స!) ఈ గ్రంథంలో మర్యమ్ విషయాన్ని కూడా ప్రస్తావించు. అప్పుడామె తన వాళ్ళనుంచి వేరై, తూర్పు వైపుకు వచ్చింది.

మర్యమ్ 19:17 - ఆ తరువాత వారికి చాటుగా తెరవేసుకుంది. అప్పుడు మేము ఆమె వద్దకు మా ఆత్మ (జిబ్రయీలు అలైహిస్సలాం)ను పంపాము. అతడు ఆమె ఎదుట సంపూర్ణ మానవాకారంలో వచ్చాడు.

మర్యమ్ 19:18 - ''నేను నీ బారి నుంచి కరుణామయుని (అల్లాహ్) శరణు వేడుతున్నాను, నువ్వు ఏ మాత్రం దైవభీతి గలవాడవైనా (ఇక్కణ్ణుంచి వెళ్ళిపో)'' అని ఆమె చెప్పింది.

మర్యమ్ 19:19 - ''నేను నీ ప్రభువు తరపున పంపబడిన దూతను. నీకు ఒక పవిత్రుడైన పిల్లవాణ్ణి ఇవ్వటానికి వచ్చాను'' అని అతనన్నాడు.

మర్యమ్ 19:20 - ''నాకు పిల్లవాడు కలగటమేమిటీ? నన్ను ఏ మగాడూ కనీసం తాకనైనా లేదే! నేను దుర్నడత (చెడు నడవడిక) గల దాన్ని కూడా కానే!!'' అని ఆమె అన్నది.

మర్యమ్ 19:21 - ''జరిగేది మాత్రం ఇదే. 'అది నాకు చాలా సులువు. మేము అతన్ని జనుల కోసం ఒక సూచనగా, మా ప్రత్యేక కృపగా చేయదలిచాము. ఇదొక నిర్ధారిత విషయం' అని నీ ప్రభువు సెలవిచ్చాడు'' అని అతను వివరించాడు.

మర్యమ్ 19:22- అంతే, ఆమె గర్భవతి అయింది. ఈ కారణంగా ఆమె ఏకాంతం కోసం దూర ప్రదేశానికి వెళ్ళిపోయింది.

మర్యమ్ 19:23 - ఆ తరువాత పురిటినొప్పులు ఆమెను ఒక ఖర్జూర చెట్టు క్రిందికి చేర్చాయి. ''అయ్యో! నేను ఇంతకు మునుపే చచ్చిపోయి వుంటే, లోకులు నన్ను మరచిపోయి ఉంటే బావుండునే!'' అని ఆమె బాధపడసాగింది.

మర్యమ్ 19:24 - అంతలో (దైవదూత) క్రింది నుంచే ఆమెను పిలిచి ఇలా అన్నాడు: ''బాధ పడకు. నీ ప్రభువు నీ క్రింద ఒక నీటి ఊటను ప్రవహింపజేశాడు.

మర్యమ్ 19:25 - ''ఆ ఖర్జూరపు మొదలును నీ వైపుకు ఊపు. తాజా ఖర్జూర పండ్లు నీపై రాల్తాయి.

మర్యమ్ 19:26 - ''ఇక హాయిగా తిను, త్రాగు, కన్నుల పండుగ చేసుకో. ఏమనిషైనా నీకు తారసపడితే, 'నేను కరుణామయుని కోసం ఉపవాస వ్రతం పాటిస్తున్నాను. ఈ రోజు నేను ఎవరితోనూ మాట్లాడను' అని చెప్పు.''

మర్యమ్ 19:27 - ఆ తరువాత ఆమె ఆ పసివాణ్ణి ఎత్తుకుని తన జాతి వారి వద్దకు వచ్చింది. "ఓ మర్యమ్! నువ్వు పెద్ద పాపం చేశావు.

మర్యమ్ 19:28 - ఓ హారూన్ సోదరీ! నీ తండ్రీ చెడ్డవాడు కాడు. నీ తల్లి కూడా చెడు నడత గల స్త్రీ కాదే!" అని అందరూ అన్నారు.

మర్యమ్ 19:29 - మర్యమ్ తన పసిపిల్లవాని వైపు సైగ చేసి చూపించింది. "ఒడిలో ఉన్న ఈ పసికందుతో మేమెలా మాట్లాడగలం?" అన్నారు వారంతా.

మర్యమ్ 19:30 - ఆ పసివాడు ఇలా పలికాడు: "నేను అల్లాహ్ దాసుడను. ఆయన నాకు గ్రంథం ఒసగాడు. నన్ను తన ప్రవక్తగా నియమించాడు.

మర్యమ్ 19:31 - "నేనెక్కడున్నాసరే ఆయన నన్ను శుభవంతునిగా చేశాడు. నేను జీవించి ఉన్నంతకాలం నమాజు, జకాతులకు కట్టుబడి ఉండమని ఆయన నాకు ఆదేశించాడు."

మర్యమ్ 19:32 - "ఇంకా – ఆయన నన్ను నా తల్లికి సేవచేసేవానిగా చేశాడు. నన్ను దౌర్జన్యపరునిగానూ, దౌర్భాగ్యునిగానూ చేయలేదు.

మర్యమ్ 19:33 - "నేను పుట్టిన రోజూ, నేను చనిపోయే రోజూ, నేను సజీవినై తిరిగి లేపబడేరోజూ నాపై శాంతి కలుగుతుంది."

మర్యమ్ 19:34 - ఇదీ మర్యమ్ కుమారుడైన ఈసా యదార్థ గాథ. ప్రజలు సంశయంలో పడివున్న సత్యవాక్కు ఇదే.

మర్యమ్ 19:35 - అల్లాహ్‌కు సంతానం ఉండటం అనేది ఎంత మాత్రం తగదు. ఆయన పరమ పవిత్రుడు. ఆయన ఏ పనినైనా చేయాలని సంకల్పించుకున్నప్పుడు 'అయిపో' అని ఆజ్ఞాపిస్తాడు. వెంటనే అది అయిపోతుంది.

మర్యమ్ 19:36 - నిశ్చయంగా నాకూ, మీకందరికీ ప్రభువు అల్లాహ్ మాత్రమే. కనుక ఆయన్నే ఆరాధించండి. ఇదే రుజుమార్గం (అని ఈసా – ఏసుక్రీస్తు – బోధించాడు).

మర్యమ్ 19:37 - మరి ఈ ముఠాలు పరస్పరం విభేదించుకున్నాయి. కాబట్టి సత్యతిరస్కారులు ఒక మహా (కఠినమైన) దినాన హాజరైనపుడు, వారికి మూడుతుంది.

మర్యమ్ 19:38- వారు మా సమక్షంలో హాజరైన రోజు ఎంత బాగా వింటూ, చూస్తూ ఉంటారు! కాని ఈ దుర్మార్గులు ఈనాడు మాత్రం స్పష్టమైన అపమార్గానికి లోనై ఉన్నారు.

మర్యమ్ 19:39 - వ్యవహారం తేల్చబడి వారు బాధపడే రోజు గురించి (ఓ ముహమ్మద్ – సఅసం!) వారిని హెచ్చరించు. (ఏమైనా) వారు పరధ్యానానికి గురై ఉన్నారు. వారు విశ్వసించే రకం కాదు.

మర్యమ్ 19:40 - స్వయంగా మేమే భూమికీ, భూమిపై ఉండే వారందరికీ వారసులమవుతాము. వారంతా మా వద్దకే మరలించబడతారు.

అల్ - ముల్‌మినూన్ 23:50 وَجَعَلْنَا ابْنَ مَرْيَمَ وَأُمَّهُ آيَةً وَآوَيْنَاهُمَا إِلَىٰ رَبْوَةٍ ذَاتِ قَرَارٍ وَمَعِينٍ

మేము మర్యమ్ కుమారుణ్ణి, అతని తల్లిని ఒక సూచనగా చేశాము. వారిద్దరికీ ఎత్తయిన ప్రదేశంలో ఆశ్రయం కల్పించాము. అది ప్రశాంతమైన స్థలం, నీటి కాలువగల ప్రదేశం.

అల్ - అహ్-జాబ్ 33:7 - (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకో) మేము ప్రవక్తలందరి నుండి వాగ్దానం తీసుకున్నాము- (ముఖ్యంగా ఓ ముహమ్మద్) నీ నుండి, నూహ్ నుండి, ఇబ్రాహీం నుండి, మూసా నుండి, మర్యమ్ కుమారుడైన ఈసా నుండి. మేము వారందరి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము.

అష్ - షూరా 42:13 - ఏ ధర్మాన్ని స్థాపించమని అల్లాహ్ నూహ్‌కు ఆజ్ఞాపించాడో ఆ ధర్మాన్నే మీ కొరకూ నిర్ధారించాడు. దానినే (ఓ ముహమ్మద్- సఅసం!) మేము నీ వైపుకు (వహీ ద్వారా)

పంపాము. దాని గురించే ఇబ్రాహీముకు, మూసాకు, ఈసా (అలైహిముస్సలాం)కు కూడా తాకీదు చేశాము. ఈ ధర్మాన్నే నెలకొల్పాలనీ, అందులో చీలిక తీసుకురావద్దనీ (వారికి) ఉపదేశించాము. (ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు ఏ విషయం వైపునకు వారిని పిలుస్తున్నావో అది బహుదైవారాధకులకు చాలా భారంగా తోస్తుంది. అల్లాహ్ తాను కోరిన వారిని (తన కార్యం కొరకు) ఎన్నుకుంటాడు. తన వైపు మరలే వానికి ఆయన సన్మార్గం చూపుతాడు.

అజ్ - జుఖ్రుఫ్ 43:59 - అతను (మర్యమ్ కుమారుడైన ఈసా) కూడా ఒక దాసుడు మాత్రమే. మేమతన్ని అనుగ్రహించాము. ఇస్రాయీలు సంతతి వారికొరకు అతన్ని ఒక ఉదాహరణ (మా శక్తి నిదర్శనం)గా చేశాము.

అజ్ - జుఖ్రుఫ్ 43:61 - నిశ్చయంగా అతను (ఈసా – అలైహిస్సలాం) ప్రళయానికి ఒక సూచన. కాబట్టి మీరు దాని (ప్రళయదినం) విషయంలో సందేహపడకండి. మీరు నన్ను అనుసరించండి. ఇదే రుజు మార్గం.

అజ్ – జుఖ్రుఫ్ 43:63 - స్పష్టమైన నిదర్శనాలను తీసుకుని వచ్చినప్పుడు ఈసా (ఏసు – అలైహిస్సలాం) ఇలా అన్నాడు: "నేను మీ దగ్గరకు వివేకాన్ని తెచ్చాను. మీరు విభేదించుకుంటున్న కొన్ని విషయాల వాస్తవికతను విడమరచి చెప్పటానికే వచ్చాను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి.

అల్ - హదీద్ 57:27 - మరి వారి వెనుకే మేము మా ప్రవక్తలను నిరంతరం పంపసాగాము. వారి తరువాత మర్యం కుమారుడైన ఈసాను పంపాము. అతనికి ఇంజీలు గ్రంథాన్ని ఒసగాము. అతన్ని అనుసరించే వారి హృదయాలలో మృదుత్వాన్ని, జాలిని సృజించాము. మరైతే సన్యాసత్వాన్ని (రహ్ బానియత్) వారంతట వారే ఆవిష్కరించారు. మేము మాత్రం దీనిని వారిపై విధించలేదు. దైవప్రీతిని తప్ప! మరి వారు దానికి తగురీతిలో కట్టుబడి ఉండలేకపోయారు.

అయినప్పటికీ మేము వారిలో విశ్వసించిన వారికి వారి పుణ్య ఫలాన్ని ప్రసాదించాము. వారిలో అధికులు మాత్రం అవిధేయులుగా తయారయ్యారు.

అస్ - సఫ్ 61:6 - మర్యమ్ కుమారుడైన ఈసా, ''ఓ ఇస్రాయీలు సంతతివారలారా! నేను మీ వైపు అల్లాహ్ తరపున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. నా తరువాత రాబోయే ప్రవక్తను గురించి శుభవార్తను ఇస్తున్నాను. అతని పేరు అహ్మద్'' అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించదగినదే). తీరా అతను స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చినప్పుడు, ''ఇది పచ్చి ఇంద్రజాలం'' అని వారు అన్నారు (తేలిగ్గా కొట్టి పారేశారు).

అస్ - సఫ్ 61:14 - ఓ విశ్వాసులారా! మర్యం కుమారుడైన ఈసా తన హవారీలతో, ''అల్లాహ్ మార్గంలో నాకు సహాయపడగల వారెవరు?'' అని అన్నప్పుడు, ''అల్లాహ్ మార్గంలో మేము సహాయపడతాము'' అని హవారీలు సమాధాన మిచ్చినట్లు మీరు కూడా అల్లాహ్ కు సహాయకులు అవండి. తరువాత ఇస్రాయీలు సంతతివారిలో ఒక వర్గం వారు విశ్వసించగా, మరొక వర్గం వారు తిరస్కరించారు. అప్పుడు మేము విశ్వసించిన వారికి వారి శత్రువులకు వ్యతిరేకంగా తోడ్పడ్డాము. తత్ఫలితంగా వారు గెలుపొందారు.

అత్ - తహ్రీమ్ 66:12 - మరి ఇమ్రాన్ కుమార్తె అయిన మర్యం (గురించి కూడా అల్లాహ్ ఉదాహరిస్తున్నాడు). ఆమె తన మానాన్ని కాపాడుకున్నది. మరి మేము మా తరపున ఆమెలో ప్రాణాన్ని ఊదాము. మరి ఆమె తన ప్రభువు వచనాలను, ఆయన గ్రంథాలను సత్యమని ధృవపరచింది. ఆమె వినయవిధేయతలు గల స్త్రీమూర్తుల కోవకు చెందినది.

చివరికి

ప్రియమైన పాఠకుడా, ఈ వచనాలు ఏ సత్యాన్ని సూచిస్తున్నాయో ఇప్పటికే మీరు అర్థం చేసుకుని ఉండాలి. ఈ సత్యాన్ని అంగీకరించడానికి మరియు మనందరినీ సృష్టించిన ఏకైక దేవుడిని అంగీకరించడానికి మీరు తొందరపడాలి. రెండు లోకాలలో విజయం సాధించడానికి, యేసుక్రీస్తు (ఈసా) దేవుని సందేశహరుడు అని మరియు ముహమ్మద్ ప్రవక్త దేవుని చిట్టచివరి సందేశహరుడు అని అంగీకరించండి. ఈ పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం కూడా ఇదే.

పవిత్ర ఖుర్ఆన్ అనువాదాన్ని పొందడం మర్చిపోవద్దు మరియు ఖుర్ఆన్ అనువాదాన్ని ఇంగ్లీష్, తెలుగు హిందీ, కన్నడ, మలయాళం లేదా తమిళంలో డౌన్‌లోడ్ చేసుకోవడానికి మేము ఈ పుస్తకం వెనుక భాగంలో QR కోడ్‌ని అందించాము.

ఓ అల్లాహ్! ఈ వాస్తవమైన సందేశాన్ని ప్రజలకు చేరేలా చేయుము.

ఓ అల్లాహ్! మా నుండి ఈ కార్యమును అంగీకరించు.

ఖుర్‌ఆన్ ఇంగ్లీష్,
తెలుగు, హింది, కన్నడ,
మలయాళం,
తమిళంలో చదవడానికి...

ప్రవక్త ముహమ్మద్
జీవిత చరిత్ర పాఠాలు
తమిళంలో

సత్యం వైపునకు మరళండి

మానవులంతా ఒకే సమాజంగా ఉండేవారు. అల్లాహ్ ప్రవక్తలను శుభవార్తనిచ్చే వారుగా, భయపెట్టే వారుగా చేసి పంపాడు. ప్రజల మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలపై తీర్పు చేయటానికిగాను వారివెంట (అనగా ప్రవక్తల వెంట) సత్య బద్ధమైన గ్రంథాలను పంపాడు. మరి వాళ్ళే (అనగా ప్రజలే) – స్పష్టమైన ఆదేశాలు ఏొసగబడిన తరువాత కూడా – పరస్పర వైర భావం, అసూయ మూలంగా అందులో విభేదించుకున్నారు. అందుచేత అల్లాహ్ విశ్వాసులకు ఈ భేదాభిప్రాయం నుండి కూడా తన ఆజ్ఞానుసారం సత్యం వైపుకు దర్శకత్వం వహించాడు. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు. (2 : 213)

అల్లాహ్ వద్ద నుండి ఒక జ్యోతి (వెలుగు) మరియు స్పష్టమైన గ్రంథం

ఓ గ్రంథవహులారా! మీ వద్దకు మా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వచ్చేశాడు. మీరు కప్పిపుచ్చుతూ ఉండిన గ్రంథంలోని ఎన్నో విషయాలను అతను మీ ముందు విపులీకరిస్తున్నాడు.

మరెన్నో విషయాలను ఉపేక్షిస్తున్నాడు. అల్లాహ్ తరపు నుంచి మీ వద్దకు జ్యోతి వచ్చేసింది. అంటే, స్పష్టమైన గ్రంథం వచ్చేసింది. (5 : 15)

విశ్వసించిన ప్రజలకు మార్గదర్శకత్వం మరియు కారుణ్యం.

వారు విభేదించుకునే ప్రతి విషయాన్నీ నువ్వు వారికి స్పష్టంగా విడమరచి చెప్పాలని మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. విశ్వసించిన జనులకు ఇది మార్గదర్శకత్వం మరియు కారుణ్యం. (16 : 64)







ఓ విశ్వసించిన ప్రజలారా!


మీరు కర్తవ్యపాలనగా అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు మీరు అల్లాహ్ కు విధేయులుగా (ముస్లింలుగా) ఉన్న స్థితిలో తప్ప మరణించకండి.

(ఖుర్ఆన్ 3:102)









Quran
6 LANGUAGES
Scan here to read it


ఒక్క దేవుడా?
లేక
అనేక దేవుళ్లా?
చదవడానికి ఇక్కడ స్కాన్ చేయండి



దేవుడు ఉన్నాడా?
ఆయన ప్రత్యక్షమవుతాడా?
చదవడానికి ఇక్కడ స్కాన్ చేయండి


What happens after Death?
2 stages of Life
(Life in buried place & Life after resurrection)
Hell? or Heaven?
Scan here to read it


Prophet Muhammad
The Last Messenger
Scan here to read it


Its for you!
Fellow Muslims!!
Scan here to read it


Are you also a seeker
of True God?
Scan here to read it


Truths told in Quran about
Jesus and Mary
(peace be upon them).
Scan here to read it


Does God exist?
Will He show up?
Scan here to read it